


# ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంపై సుప్రీంకోర్టు తీర్పుకు నిరసనగా సభ

షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం దుర్వినియోగం అవుతున్నదనే సాకుతో దానిని నియంత్రించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పు దళిత, ఆదివాసీ ప్రజానీకం హక్కుల పరిరక్షణను ప్రశ్నార్థకం చేసింది. మహారాష్ట్రలోని షెడ్యూల్డు కులానికి చెందిన ఒక ప్రభుత్వాధికారి తన ఉన్నతాధికారి మీద ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టాడు. దానిని తప్పుదారి పట్టించిన పోలీసు అధికారిపై కూడా అదే కేసు నమోదయింది. సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం, ఎఎన్ఆర్‌కి సంబంధించిన ఈ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం కొన్ని మార్గదర్శకాలను జారీచేసింది.

సుప్రీంకోర్టు ద్విసభ్య (జస్టిస్ ఎకె గోయెల్, జస్టిస్ యుయు లలిత్) ధర్మాసనం ఇచ్చిన 89 పేజీల తీర్పు సారాంశం ఏమిటంటే... ఇకమీదట ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద నమోదయ్యే కేసుల్లో వెను వెంటనే అరెస్టులు చేయకూడదు. అటువంటి కేసుల్లో వారం రోజుల్లోపల ప్రాథమిక విచారణ నిర్వహించి, ఫిర్యాదు సరైందేనని నిర్ధారించుకోవాలి. అప్పుడు మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అయినప్పటికీ అరెస్టు తప్పనిసరి కాదు. ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకపోతే ముందస్తు బెయిల్ కూడా ఇవ్వవచ్చు. ప్రభుత్వోద్యోగిపై ఫిర్యాదు దాఖలైతే అతని అరెస్టుకు సంబంధిత నియామక అధికారి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇతరులపై ఫిర్యాదు విషయంలో సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా డిఎస్‌పి అనుమతి అవసరమవుతుంది.

ఈ చట్టం కింద ఎందరో అమాయకులు నిందితులుగా నిలవాల్సి వస్తుందని, విధి నిర్వహణలో ప్రభుత్వ సేవకులు సైతం బెదిరింపులు ఎదుర్కోవలసి వస్తుందని; వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి, వేధింపులకు గురిచేయడానికి శాసన నిర్మాణం జరగలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ఈ ఇద్దరు న్యాయమూర్తులు హక్కుల పరిరక్షణ చట్టాల దుర్వినియోగం గురించి ఆదేశాలివ్వడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది జూలైలో భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 498ఏ విషయంలోనూ ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని పరిశీలించడానికి 'కుటుంబ సంక్షేమ సంఘాలు' ఏర్పాటు చేయాలని, ఆ తర్వాతే నిందితులను అరెస్టు చేయాలని పేర్కొన్నారు. బాధిత వర్గాల పరిరక్షణకు ఉద్దేశించిన ఇటువంటి చట్టాల విషయంలోనే దుర్వినియోగం ఆరోపణలు వస్తున్నాయన్న వంకతో, ఆ చట్టాలనే నిర్వీర్యం చేసే తీర్పులిస్తున్నారంటే ఈ న్యాయమూర్తుల పక్షపాత వైఖరి తెలియవస్తుంది.

ఈ సందర్భంలోనే కరియా ముండా అధ్యక్షతన గల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటి 01.09.2000లో తన రెండవ నివేదికలోని అంశాలను మనం గుర్తుచేసుకోవాలి. వెనుకబడిన తరగతుల అభివృద్ధి పట్ల న్యాయవ్యవస్థకు గాని, ఉన్నత న్యాయస్థానాలలోని న్యాయవాద సంఘాలకు గాని ఏ మాత్రం సానుభూతి లేదని ఆ నివేదిక ఎత్తి చూపింది. వెనుకటి కాలపు దురభిప్రాయాలు, జీవితంలో అంతరాలు సహజమనే ఆలోచనలు గల వర్గాల వారే న్యాయమూర్తులవుతున్నారని ఆ నివేదిక పేర్కొంది. అటువంటి వారికి ఉండే అంతర్గత పరిమితులు, వర్గ ప్రయోజనాలు నిజాయితీతో తీర్పులు చెప్పేందుకు వారికి అవకాశమివ్వవని; వారి ఆలోచనలు తరచూ పేద వర్గాలకన్న పాలక వర్గాలకే ఎక్కువ ఉపయోగకరంగా ఉంటాయని ఆ నివేదిక స్పష్టం చేసింది.

దళిత, ఆదివాసీ ప్రజానీకం సుదీర్ఘ కాలం చేసిన ఉద్యమాలతో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం సాధించుకుంది. శతాబ్దాల అవమానాలు, అత్యాచారాలు, నరమేధాలను దాటుకొని ఒకానొక సామాజిక న్యాయహక్కుగా సంపాదించుకొంది. దళితుల పట్ల, ఆదివాసుల పట్ల అగ్రకులాలు పాటించే 22 రకాల వివక్షలను గుర్తించి, వాటిని తొలగించేందుకు, శిక్షించేందుకు 1989లో మన పార్లమెంటు దీనిని అమలులోకి తెచ్చింది. ఈ చట్టం అమలు చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ప్రతిపాదించడంతో పాటు

నేరనిరోధానికి సైతం అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వమని చెపుతుంది. సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరించడం, కులం పేరుతో దూషించడం, శిరోముండనం, మీసాలు తొలగించడం, మెడలో చెప్పులతో ఊరేగించడం తదితర చర్యలను నేరాలుగా పరిగణించి 2015లో ఈ చట్టంలో సవరణలు చేపట్టడం ఏ అఘాయిత్యాల తీవ్రతను సూచిస్తుంది? ఏయే మితిమీరిన వివక్షలకు సాక్ష్యాలుగా చూపిస్తుంది?

దళితులు, ఆదివాసులపై దాడులు పెరుగుతున్నాయని, సకాలంలో కేసులు నమోదు కావడం లేదని జాతీయ ఎస్సీ కమిషన్ ఇటీవలే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 1958 నాటి కిలవేన్మణి (తమిళనాడు) సంఘటన మొదలుకొని బీహార్, కారంచేడు, చుండూరు, వాకపల్లి, మొన్నటి ఉనా (గుజరాత్) వరకు ఏమి చెబుతున్నాయి? అంతెందుకు మన సమీపంలోని వెంకటాయపాలెంలో 1996 నాటి శిరోముండనం ఘటన జరిగి 22 ఏళ్ళు కావస్తున్నప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు సరికదా అసలు వారు దళితులే కాదు బీసీలు అనేంత వరకు విచారణ వెళ్ళింది. బహుశా బాధితులు తమని తాము దళితులమని నిరూపించుకోవడంతోనే వారి శేషజీవితం ముగిసిపోవచ్చు! ఈ చట్టం అమలు తీరుతెన్నులు ఇంత అధమస్థాయిలో ఉన్నప్పుడు ఇక చట్టం దుర్వినియోగమవుతుందని గగ్గోలు పెట్టడం వెనక ఆంతర్యమేమిటో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

మరి పోలీసులు, అధికారులు ఈ చట్టం పట్ల ఎలా వ్యవహరిస్తున్నారు? న్యాయస్థానాలు ప్రదర్శిస్తున్న వైఖరి ఏమిటి? దీని గురించి సామాజిక న్యాయాన్ని కోరేవారందరూ అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి. ఆందోళన చెందవలసిన అంశాలెన్నో ఉన్నాయి. ఈ చట్టం అమలు చేయడంలో అంతులేని అలసత్వం గురించి పట్టించుకోకుండా, ఆధిపత్య వర్గాలు, రాజకీయ నాయకులు, దళారుల అవసరార్థం చోటుచేసుకుంటున్న చెదురు మదురు తప్పుడు ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవడం, హక్కుల పరిరక్షణ చట్టాన్ని నిర్వీర్యం చేయడం ఎంతవరకు న్యాయం? ముమ్మాటికీ అన్యాయమే కాబట్టి, ఈ తీర్పుని ప్రకటించగానే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దళిత, ఆదివాసీ ప్రజానీకం ధర్మాగ్రహంతో ఈ నెల రెండున బంద్ పాటించింది. దీనితో తీర్పును సమీక్షించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో అదే రోజున రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. తీర్పుపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అలాగే తీర్పును సమీక్షించాలని కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించలేమని, పది రోజుల తర్వాత సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పింది. అమాయకుల హక్కుల్ని రక్షించడమే తన ఉద్దేశ్యమని సుప్రీంకోర్టు అంటుంటే తీర్పుతో తనకు సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతుంది. ఈ పరిస్థితులలో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఈ నేపథ్యంలో మానవ హక్కుల వేదిక నిర్వహిస్తున్న సభకు అందరినీ ఆహ్వానిస్తున్నాం.

**అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల**

**08.04.2018 ఆదివారం ఉదయం 9గంటలకు**

**వక్తలు** : జి.శివనాగేశ్వరరావు, న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మానవ హక్కుల వేదిక
అమర్తలూరి రత్నప్రసాద్, న్యాయవాది, కన్వీనర్, గుంటూరు జిల్లా శాఖ, మానవ హక్కుల వేదిక
బి.భాస్కరజోగేష్, న్యాయవాది, జిల్లా కార్యదర్శి, మానవ హక్కుల వేదిక
కొంకి రాజామణి, దళిత బహుజన మహిళాశక్తి
ఎం.కాళిదాసు, జిల్లా సహాయ కార్యదర్శి, పౌరహక్కుల సంఘం
జె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి, ఐ.ఎఫ్.టి.యు
తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, పి.డి.ఎస్.యు
పి.సుధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్.పి.ఐ
కారెం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి, సి.పి.ఎం.

అమలాపురం
04.04.2018

– మానవ హక్కుల వేదిక

---

*ప్రచురణ కర్త: ముత్యాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, మానవ హక్కుల వేదిక, 9553200201*